మూడు కోతులు

ఏదో అవసరమున్నప్పుడు తప్ప మనకి యీరోజుల్లో స్నేహితులు జ్ఞప్తికి రారనుకుంటా. ఆ మధ్య అనుకోకుండా బెంగుళూరు ప్రయాణం తగిలింది. స్నేహితుడు మోహన్‌బాబుకి స్టేషన్‌కొచ్చి కలుసుకోవల్సిందని టెలిగ్రామిచ్చి బైలుదేరాను.

సుఖాన్ని పంచుకొన్న స్నేహితులపైకంటె, బాధని పంచుకొన్న స్నేహితులపట్ల జాలితో కూడుకున్న వొక ప్రత్యేకమైన అభిమానం వుంటుందనుకుంటాను.

మహాత్ముడు అస్తమించిన రోజులవి. ఆ వార్త విన్న తర్వాత వారంరోజులు నేనూ, మోహన్‌బాబూ సరిగ్గా భోజనం చెయ్యలేదు. రెండు రోజులు ఉపవాసముండి, మహాత్ముని జీవిత ఘట్టాలని స్మరించుకుంటూ వారి జీవితచరిత్ర చదువుకుంటూ, వారి ఫోటోలు చూసుకుంటూ గడిపి బాధను పంచుకున్నాం. మమ్మల్ని గురించి కాకుండా, ప్రపంచం గురించి బాధపడటం కొత్త అనుభవం. ఆదర్శాల ఐక్యతలో తాత్వికమైన అనుభూతివున్నా, ఆ ఆదర్శాలని జీవితంలో సాధించలేమేమో అన్న భయం కూడా వుంది. ఈ భయమే మా స్నేహానికి కారణమని యిప్పుడు తోస్తోంది.

మూడుకోతుల ప్రతిమ ఆ రోజుల్లోనే ప్రచారమైంది. ఒక కోతి చెవులు, రెండోది కళ్ళు, మూడోది నోరూ మూసుకుని వుండే యీ కోతుల ప్రతిమను మహాత్ముడు తన దగ్గర వుంచుకొనేవాడట. చెడు చూడొద్దు; చెడ్డమాట వినొద్దు; చెడు చెప్పకు – యీ మూడు నైతిక సూత్రాలకు ఆ ప్రతిమ సాంకేతిక చిహ్నాం. ఈ కోతులగాథ పుట్టు పూర్వోత్తరాలు నాకు తెలియవు. చీనాదేశపు పిట్టకథలలో అవతరించిందని కొందరంటారు. వాల్మీకి రామాయణంలో ఆంజనేయులు, లౌకిక జగత్తులో ప్రయోజకత్వానికీ, ఐహిక బలానికీ, శారీరిక శక్తికీ చిహ్నాంగా పరిగణిస్తారు కొందరు. బౌద్ధ కథా వాంజ్మయంలో కోతి కొత్త అవతారం దాల్చింది. చీనా దేశపు తత్వజ్ఞుడు "ఊ చెంగ్ – ఎన్" కోతిని గూర్చి వ్రాసిన గ్రంథంలో ఓ చిత్రమైన కథ వుంది. ఆ కథలో కోతి స్వర్గానికెడుతుంది. అక్కడ కోతల్లరి సాగిస్తుంది. దీనితో వేగలేక అక్కడివారు బుద్ధుని రప్పిస్తారు. బుద్ధుడు ఆ కోతితో వో పందెం వేస్తాడు – తన అరచేతిని దాటి అవతలకి దూకగలిగితే, కోతికి స్వర్గంలో సింహాసనం లభిస్తుందని; అట్లా చెయ్యలేకపోతే తాను భూలోకానికి వెళ్ళి కొన్ని యుగాలు తపస్సు చెయ్యాల్సి వుంటుందని. అందుకు ఆ కోతి అంగీకరించి దూకడానికి ఉపక్రమిస్తుంది. తన తెలివంతా ఉపయోగించి దూకుతుంది. చాలాసేపు దూకుతూ పోతుంది. కొంతదూరం వెళ్ళాక ఆకాశంలోకి పొడుచుకుని ఐదు స్తంభాలు కనబడతాయి. తాను దూకివొచ్చినందుకు నిదర్శనంగా, వొక స్తంభంపై వెండ్రుకతో "స్వర్గంతో సమానుడైన మహాతపస్వి యిటు వచ్చాడు" అని వ్రాసి తిరిగి బుద్ధుని దగ్గరకొచ్చి, తాను పందెం గెలిచాను కావున, ఆ సింహాసనం యిప్పించమని కోరుతుంది. బుద్ధుడు తన వేలు పైకెత్తి

దానిమీద వ్రాసివున్న అక్షరాలను చూపించి, కోతి తన అరచేతిని దాటి వెళ్ళలేకపోయిందని ఋజువుచేసి దాన్ని స్వర్గాన్నుండి తప్పిస్తాడు. ఈ కథలో తెలివికి, ప్రజ్ఞకి చిహ్నంగా అవతరిస్తుంది కోతి. విజ్ఞానం చాలదు, జ్ఞానంకూడా ఉండాలని బోధ.

మూడుకోతుల ప్రతిమకి నైతికరంగంలో ప్రాముఖ్యం కల్పించాడు గాంధీజీ. ఆ రోజుల్లో మూడుకోతుల రబ్బరు బొమ్మ ఒకదాన్ని సంపాదించాను. మోహన్‌బాబు పైచదువుకి వెడుతుంటే, జ్ఞాపకంగా ఆ బొమ్మని అతనికిచ్చివేశాను.

బెంగుళూరు మరో గంటలో వస్తుందనగా రైలు ఒక స్టేషన్‌లో నిలిచింది. ఫలానా 'చిత్రం చూశారా?' అంటూ, చేతులను కండ్లకి అడ్డంగా పెట్టుకున్న కోతిబొమ్మ ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఒకదాన్ని అక్కడ చూశాను. అది చూసింతర్వాత, యీ మూడుకోతుల ప్రతిమ గూర్చి కొన్ని శంకలు రాసాగాయి. 'చెడ్డమాట వినొద్దు' అని చెవులు మూసుకోటం విషయం చూడండి. కాస్తంత విన్నతర్వాతగదా, ఆ మాట చెడ్డదో మంచిదో తెలిసొచ్చేది? అల్లాగే చెడును చూడకుండా కళ్ళుమూసుకోడం, చూడటం మొదలుపెట్టిం తర్వాతేకదా. అది చెడో మంచో తెలియడం? అసలు చెడ్డ విషయాలపట్లే మనిషి కుతూహలం రేకెత్తేది. ఈ ఉదాహరణ చూడండి: నేనొక సభలో ఉన్నాను. అక్కడ ఒక దుండగీడు తుపాకి పైకితీసి ఒక వ్యక్తికేసి గురిచెయ్యడం చూశాను. గురి బాగా చూస్తున్నాడు. సమయంకోసం వేచివున్నాడు. మరోక్షణంలో అవతలవ్యక్తి – ఒక ప్రముఖ పురుషుడు అనుకుందాం – హత్యకాబడతాడు. నేను చూస్తున్నది చెడుగే – హత్యాకాండ. అటు చూడకుండా కండ్లు మూసుకోవడమా? లేక నా ప్రక్కనవున్న పోలీసు ఉద్యోగి జేబులోంచి పిస్తోలు తీసి, ఆ తుపాకి వ్యక్తిమీద పేల్చి, ఆ ప్రముఖ పురుషుడి ప్రాణాలు కాపాడటమా? అట్లా కాపాడితే 'అయ్యో పాపం – ఒక గొప్పవ్యక్తి ప్రాణం కాపాడాడు – ఇతన్ని నాయకుడుగాచేసి, ఒక శిలా ప్రతిమని అతని గ్రామం మధ్యగా నెలకొల్పుదాం' అని అంటారా ప్రజ? హంతకుడిని చంపినా, నేనొక హంతకుడుగా పరిగణింపబడి, శిక్షకి పాత్రుడ నవుతాను. న్యాయం, చట్టం – వీట్లకి వ్యక్తుల విచక్షణలేదు. జడ్జిగారు మంచివాడైతే, 'ఈహత్య చెయ్యడంలో యితని ఉద్దేశం ప్రశంసనీయమైంది – ఒక ప్రజాసేవకుడి ప్రాణం కాపాడాడు – కాన, ద్వీపాంతరవాసం విధిస్తున్నాను' అనొచ్చునేమో. కొన్ని సందర్భాలలో ఏది మంచో, ఏది చెడో ఎవ్వరూ నిర్ణయించలేరు. మొత్తంమీద గమ్యస్థానం మంచిదైనా, చేరుకునే మార్గం చెడ్డదైతే కళ్ళు గట్టిగా మూసుకోడమే మంచిదని, యీ కోతితత్వం. కళ్ళు మూసుకునేటందుకు రెప్పలున్నాయికదా – మళ్ళా యీ చేతులతో గట్టిగా మూసుకోడం దేనికో! వేళ్ళమధ్య సందులోంచి కాస్త కాస్త చూడవచ్చుననా! ఏమో నాకు తెలీదు. కొన్ని కొన్ని విషయాల గూర్చి తీవ్రంగా శోధించక, అల్లా విడిచిపెట్టడమే శ్రేయస్కరం.

అల్లాగే చెడు చెప్పకుండా నోరు నొక్కుకోవడం, చెడుగుని చూడకుండా, వినకుండా ఉన్నవారికి, అసలు చెప్పేటందు కేముంటుంది? మహత్తర సత్యానికీ, సౌందర్యానికీ ఎల్లానూ నోరులేదు. దైవాన్ని తపస్సుద్వారా సందర్శించిన యోగిపుంగవుడికి భాషతో నిమిత్తంలేదు. ఆలోచనని మరుగుపరిచేందుకే భాష అంటున్నారు పెద్దలు. జీవితాన్ని చూడకుండా, వినకుండా, స్పృశించకుండా ఉన్నవారికి ఆలోచన లేముంటాయి? ఇలా

వెళ్ళినకొద్దీ లోతులు పెరుగుతూంటాయి – అందుచేత అట్టే ఆలోచించక, మరోవిషయంపైకి దృష్టి మరల్చాను. ఇంతలో బెంగుళూరు స్టేషను రానే వచ్చింది.

ప్లాట్‌ఫారంమీద మోహన్‌బాబు సిద్ధంగా ఉన్నాడు. ఏమిటో మనల్ని కలుసుకోడం కోసం ఎవరైనా స్టేషన్‌కి వచ్చారంటే మనపైనా ఆ వచ్చిన వ్యక్తిపైనా ఆపేక్ష, గౌరవం పెరుగుతాయి. పక్కవాటా వాళ్ళకి ఉత్తరాలు యిచ్చి వెడుతూవున్న పోస్టుమాన్ 'మీకేమీ లేవండి' అన్నప్పుడు దిగాలుపడిపోతాం. ఈ చిన్న విషయాలే మన వ్యక్తిత్వం, ఉనికిని రుజువు చేస్తాయనుకుంటాను. మోహన్‌బాబు దిగగానే నన్ను కౌగలించుకొని మందహాసం చేసినా అతనెందుకో దిగాలుగా ఉన్నట్లు కనిపించాడు. మహాత్ముడు అస్తమించిన రోజుల్లో మాటా, పలుకూ లేకుండా ఒకరివంక ఒకరు దిగులుగా చూస్తూ కూర్చున్న దృశ్యం స్మరణకొచ్చి కాబోలు...!

ఒక మొహంయొక్క వర్చస్సు పంచుకొన్న ఒక అనుభవంతో ముడిపడి మనస్సులో నిలిచిపోయిన తరువాత కొత్త జీవితానుభవాలు దాన్ని కాలచక్రంలో పడేసి రకరకాలుగా సాగేసినా మన మనస్సులో ఉన్న ఆ ప్రతిమ వైఖరి మటుకు మారదు. చదువూ, సంస్కృతీ పెంచుకొని మోహన్‌బాబు ముందుకు ప్రయాణం చేస్తున్నా నుదుటిమీద జుట్టు మాత్రం వెనక్కి జరుగుతూవుంది. పళ్ళమీదశ్రమతో కదిలిన నవ్వు, కళ్ళల్లో మూలలకి నక్కినట్లనిపించింది. మనిషి చిక్కాడు. హడావిడిగా గడ్డం చేసుకొన్న వైఖరి.

"ఏం అలా వున్నావు, వంట్లో బాగాలేదా? రా వెడదాం" అని సామాన్లు పోర్టరు నెత్తినపెట్టి వెనకాలే నడుస్తున్నాం గేట్లో యివ్వడానికి టిక్కెట్టుపైకి తీశాను.

"సామాన్లు వెయిటింగు రూమ్‌లో పెడదాం. రా, చెప్తాను" అన్నాడు మోహన్‌బాబు.

"ఏం... కథ?"

"నేను యింటికి వెళ్తున్నాను. నా రైలు మరో గంటా గంటన్నరలో వస్తుంది. అంతవరకూ యిక్కడే కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.

"ఇంటికెందుకూ, ఇవాళే వెళ్ళాలా?"

"ఏదో సంబంధం వచ్చిందిట, చూడ్డానికి రమ్మన్నారు."

పైకి నవ్వేశాను. వెయిటింగ్ రూములో వ్యక్తులు మాకేసి చూశారు.

"పెండ్లి సంబంధానికి వెడుతూ అంత దిగులెందుకూ? అయినా – ఊహించగలనులే – చాలామందికి పెళ్ళంటే భయం – అంటే ఒకామెను చేసుకోగానే మిగతా కన్యలనుండి విడిపోవాలే అనే దిగులుకాదూ!" మోహన్‌బాబు నవ్వడం సాగించాడు. అపచారం చెయ్యని దోషిలాగ.

"అల్లా కాఫీ తాగివొద్దాంరా, నీతో చాలా చెప్పాలి."

బయల్దేరాం.

"నేను దిగులుగా వున్నానని నీకెట్లా తెలుసూ?"

"ఏదో అల్లాగనిపించింది."

"అదంతా పెద్ద కథ" అని చెప్పడం సాగించాడు. కథకి తుదిమొదలూ ఉండాలన్నారు పెద్దలు. దానికో స్వరూపం వుండాలి. అప్రస్తుతమైన నిత్యజీవితమనే చెత్త

కాగితాల బుట్టలోంచి ప్రస్తుతానికి పనికొచ్చే కాగితం ముక్కలని ఏరి అతికించి కూర్చి నైతిక విలువలుకట్టే న్యాయస్థానంలో దాఖలు చేసుకోవాలి. ఈ పనికి తగినంత అనుభవం, శిక్షణ, ఉన్నా లేకపోయినా సమయానికి న్యాయస్థానంలో దాఖలు చెయ్యడం తప్పదు గనక నా ధోరణిలో ఆ కథ చెప్తాను.

పరీక్షకోసం బెంగుళూరులో వొక నెల వుండాల్సివొచ్చి, హాస్టల్‌లో చోటుదొరక్క హొన్నప్ప గారింట్లో వో వాటాలో మకాం వుంటున్నాడు మోహన్‌బాబు. ముందు రెండు గదులు, వొక వరండా, దానిముందు నాలుగైదు పూలమొక్కలు, కిటికీలోంచి చిటారుకొమ్మ దాకా కనబడే రెండు కొబ్బరిచెట్లు, కాంపౌండుగోడ – అదీ అతనివాటా. బల్లమీద అలారమ్ గడియారం, రబ్బరు కోతులబొమ్మ, గోడమీద గాంధీగారి పటం, స్నేహితులతో కలిసి తీయించుకున్న ఫోటో అముర్చుకున్నాడు. భోజనం హోటలు నుండి కారియర్‌లో వాళ్ళ పనిపిల్ల 'నానీ' తీసుకొస్తుందిట. గది వూడ్చడం, పక్క వెయ్యడం తియ్యడం, కాఫీ తెచ్చిపెట్టడం, ఉత్తరాలు పోస్టుచెయ్యడం – యిల్లాంటి చిల్లర పనులు చేస్తుంది 'నానీ'. వాళ్ళమ్మ అలిమేలు. హొన్నప్ప గారింట్లో పనికుంది.

హొన్నప్పగారు వ్యాపారస్థుడు బస్తీ సంస్కృతి అంతగా అబ్బని పూర్వాచార పరాయణుడు. ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు – మరీ ఛాందసురాలు. కొడుకు మాధవరావు (ముద్దుగా ఇంట్లో 'మావూ' అని వ్యవహరిస్తారట) పట్నంలో చదువు కుంటున్నాడు. శెలవలకివొచ్చి, వారం పదిరోజులు కులాసాగా గడపి వెడుతూవుంటాడు. ఇంతకంటె మోహన్‌బాబుకి వారిని గురించి ఏమీ తెలియదు. ఇవేనా నానీ ద్వారా తెలుసుకున్నవే. 'నానీ' కన్నడ ప్రాంతంలో వుండిపోయినా తెలుగు బాగానే మాట్లాడుతుంది.

స్నానంగదికి సన్నటి సందులోంచి వెళ్ళాలి – ఆ సందుపొడుగునా గోడవుంది. అట్లా వెడుతుంటే అప్పుడప్పుడు హొన్నప్పగారింట్లో సంచలనం, మాటలు, సగంసగం వినబడుతూంటాయి. కాని మోహన్‌బాబు వాటినెప్పుడూ నిదానించి వినలేదు. అయినా ఆ వృద్ధదంపతులకు చెప్పుకునే మాట్లేముంటాయి?

మోహన్‌బాబు వారిపట్ల కాస్తంత కుతూహలం కనబరిచినా, దానికి కారణం కొంతవరకూ 'నానీ'యే. నానీ ఇరవైయేళ్ళ వయసుపిల్ల. దుబ్బుగా వొంకులు తిరిగిన ఆ జుట్టులో మొహం గుండ్రంగా కనిపించినా, పరీక్షగాచూస్తే కోలమొహం. మోహన్‌బాబుకి కోలమొహం ఇష్టం. గుండ్రటి 'చంద్రబింబంలాంటి' మొహం అంటే రోత. కోలమొహంలో ఒక నాజూకు 'గ్రేస్' వుందంటాడు. ఆ నాజూకు 'నానీ' శరీరం అంతటా వుందిట. పోషణ, షోకులేక చింపిరిగా వుండటం మూలాన, ఆ నాజూకు మరింత స్ఫుటంగా ఆకర్షిస్తుందిట. సన్నటినడుం, పొడుగాటికాళ్ళు, తీర్చిన వక్షం, రెండుచేతులనూ వొక్క చేత్తో నొక్కి పెట్టాలనిపించే నునుపైన చేతులు – గాజులు లేవు. అందుకే మరీ ఆకర్షణీయంగా వుంటాయిట. మెళ్ళో ఏమీలేవు. చెవులకేమీలేవు – లవంగాలు తప్ప. ఆ సన్నటి నడుంపై, బరువుగా పెద్దవిగా కనిపించే స్తనాలు మరింత ఆకర్షణీయంగా వుంటాయిట వొదులు రెవికలోంచి ఎంత బిగించి కట్టినా, గది ఊడుస్తున్నప్పుడు, మధ్య లోతైన పాయచుట్టూ వాటికదలిక గుండ్రతనం, నునుపువాటిని చూసి తాత్కాలికంగా

సంతోషపడే అవకాశాలెన్నో వున్నాయిట. ఆధునిక శిల్పాలలో అట్లాంటి నగ్నస్త్రీ సౌందర్యాన్ని చూశాడు – బెంగుళూరు ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో. ఆ మధ్య వొంగి వూడుస్తున్నప్పుడు, నానీ వక్షం అల్లాగే అనిపించింది.

ఆ రోజున గది వూడుస్తూ గాలికి తలుపుదగ్గరగా మూసినప్పుడు కొంగు తలుపు సందులో తగులుకుని లేచేటప్పుడు, పమిటంతా వూడినప్పుడు, అతను చూడ్డంతో వారిలో వొక అన్యోన్యభావం ప్రబలినట్లనిపించింది. సిగ్గుపడి, చీపురు అక్కడ వొదిలేసి పరుగెత్తుకు పోయింది నానీ. అతను చూసింతర్వాత, పక్కకు తిరిగి బల్లమీద మూడుకోతుల బొమ్మను వెనక్కి తిప్పి నిలబెట్టాడు.

శెలవులకు మాధవరావు పట్నంనుంచి రావడంతో మోహన్‌బాబు ప్రశాంత జీవనంలో సంచలనం బైలుదేరింది. మాధవరావుతో ఇతనెప్పుడూ మాట్లాడలేదు. కలుసుకున్నప్పుడు వొకర్నిచూసి వొకరు నవ్వుకోడం, మందహాసం ప్రకటించడం వరకే వారి పరిచయం.

ఆ రోజు ఇంటిదగ్గరనుంచి మనియార్డరొచ్చింది. గది అద్దె నానీ ద్వారా పంపుదామని పర్సులోంచి లెక్కతీశాడు. మరో రెండురూపాయిల నోటు చేతులోకొచ్చింది. 'నానీ'ని పిల్చాడు. వచ్చింది. తలుపు జేరవేశాడు. కిటికీలోంచి అటూ ఇటూ చూశాడు. నోట్లు చూపాడు. నానీ కళ్లు పెద్దవి చేసింది భయంతో తలవూపింది. చెయ్యిపైకి పెట్టమన్నాడు. చేతులో చీపురు గిరవాటెట్టి గది అవతల తలుపు తెరిచి ఒక్క పరుగున వెళ్ళింది నానీ.

అతనికి నవ్వొచ్చింది. ఎందుకట్లా భయపడుతుంది? ఇంకా పిల్లకీ పెళ్ళికాలేదు. అలిమేలు ద్వారా అదికాస్తా తెలుసుకున్నాడు. పెళ్ళికాకపోతే? ఏదో సంశయం, పెనుగులాట, ఉన్నప్పుడే ఆడది సిగ్గు ప్రకటిస్తుంది. ఇష్టంపట్ల అయిష్టం ప్రకటించి, అవతలవాడికి అందకుండా దూరమై, వేటాడ బడటం స్త్రీనైజం. అందుకు సృష్టి సమకూర్చిన ఆయుధం సిగ్గు. 'నాని' చేష్ట అతన్ని కార్యానికి పురిగొల్పింది. ఇదివరలో అద్దె అలిమేలు ద్వారా పంపేవాడు. అలిమేలు ద్వారా పంపడం ఎందుకో? అతనే స్వయంగా హొన్నప్పగిరికి ఇవ్వొచ్చుగా. ఈ కాస్త పనికి మధ్యవర్తి ఒకరా? డబ్బుతో కూడుకొన్న వ్యవహారంలో కుటిలత్వం తప్పదు. ఈసారి నానీద్వారా పంపుతేనేం? కొబ్బరిచెట్టు కింద బట్టలు ఆరబెడుతోంది. తాడుమీదికి చేతులెత్తినప్పుడు, కండలపై నీడలు స్ఫుటంగా పడుతున్నాయి. శరీరం అంతా ఒక్కసారి పైకి ఎగబ్రాకి నమస్కారం పెడుతూ దేన్నో ఆహ్వానిస్తున్న శిలా ప్రతిమలా – అతనికేసి కోపంగా చూసింది. నల్లగుడ్డ కొనలకి జరిగినప్పుడు, పెదవులు బిగించినప్పుడు 'నానీ' శీలంగల వ్యక్తిగా, తన కాశీలం అబ్బినందుకు విచారించినట్లు, కాస్త విషాద రేఖలు కూడా ఆమెలో ప్రత్యేకమైనాకర్షణ అని, అతనొక్కడికే తెలిసిన రహస్యం. ఆ రహస్యంలో ఆనందం వుంది. అట్లాంటి దింకెవరికీ వుండదు. తనొక్కడే తెలుసుకున్న అనుభవం మరెవ్వరికీ తెలవకపోవడంలో, తెలిసే అవకాశం కూడా లేదన్న జిజ్ఞాసలో అతని ఊహా వైశాల్యం పెరిగింది. రమ్మని సంజ్ఞ చేశాడు – వూడవడం పూర్తి చెయ్యమని. ఉహు అన్నట్లుగా తలవూపింది. అతనికి కోపం వచ్చింది. మరో పనిమనిషిని

కుదుర్చుకోలేడా? మరో కుర్రాడిని. కోపంతో కిటికీ తలుపులు గభాలున మూశాడు. కోతుల బొమ్మ తనవైపు తిప్పుకున్నాడు. గుమ్మం తలుపు తెరచి చీపురుబైట గిరవాటెట్టి, మళ్లా తలుపులు చప్పుడయ్యేటట్లు మూశాడు. మూశాడే కాని గడియపెట్టలేదు. అందుకు నవ్వొచ్చిందతనికి.

స్నానానికి బయలుదేరాడు. మండువా సందులోంచి, స్నానంగది ముందు ఒక పొడుగాటి తడక అడ్డంగా కట్టివుంది. దానివెనక ఏదో కంఠాలు వినిపిస్తున్నాయి. ఒకటి హొన్నప్పగారిది. క్షణం నిలిచాడు. మరో స్త్రీకంఠం వినబడుతోంది. అది అన్నపూర్ణమ్మగారిది కాదు. గుసగుసలోకి సన్నగిల్లిన కంఠాలు అతని కుతూహలాన్ని రేపాయి. అది విన్న కంఠమే అలిమేలుది. మరో అడుగు ముందుకేసి, మరోక్షణం ఆగాడు. నోట్లు లెక్కిస్తున్న చప్పుడు వినబడుతోంది. 'రెండు' – రెండొందలు. ఎవరు ఎవరికిస్తున్నారో తెలీదు. గుసగుసలు నిలిచాయి. సన్నగా గాజుల చప్పుడు. హొన్నప్పగారి నవ్వు. లోపల్నించి అన్నపూర్ణమ్మగారి పిలుపు – అంట్లు తోముతున్న శబ్దం. దూరంగా ఏదో పిట్ట. వేడినీళ్ళ కాగుకింద కట్టెలచప్పుడు, తనకెందుకు? స్నానం గదిలోకి వెళ్ళాడు. అతని మనస్సు బాగాలేదు. హొన్నప్పగారికి, అలిమేలుకీ ఏదోఉందన్న అభిప్రాయం దృఢపడుతోంది. ఒకప్పుడున్న స్నేహం యింకా కొనసాగుతోందో మరి! వయస్సు ముదిరిన పోకిరీచేష్టలని కాపాడేది వారివయస్సే. ఆ ధైర్యంతో వారెన్నేనా చెయ్యొచ్చు. సంఘం పట్టించుకోదు – భార్యకి అన్యాయం జరగనంతసేపూ అలిమేలుకి మొగుడులేడు. యుద్ధంరోజుల్లో చనిపొయ్యాడు. డబ్బుతో సమాజంలో వ్యక్తుల స్థానం నిర్ణయించి, విలువలు కట్టిపారేసి స్థిమితంగా వుండగలం అనుకుంటాంగాని, అది పూర్తిగా నిజంగాదు. వయస్సునుబట్టి, నైతికరంగంలో విలువలు కట్టొచ్చు. హోదానుబట్టి కట్టొచ్చు. మనస్తత్వం బట్టి కూడా కట్టొచ్చు. శృంగారమయ జీవితానికి అలవాటుపడ్డ వ్యక్తి, చివరంటా అల్లాగే ఉంటాడు. అది ఇంకా పెరుగుతూ వుంటుంది కూడా. అందుకనే దురంతాలు పెద్దలకే సాధ్యమౌతాయి.

కాని మోహన్‌బాబు పెద్దవాడుకాడు. నానీ పట్ల తనకెందుకు అట్లాంటి ఆలోచనలు? తన సిద్ధాంతం తప్పు. వయసులో శృంగారం సహజమైంది; వార్ధక్యంలో కృత్రిమమైంది. చిన్నప్పుడు యవ్వనం కాపాడుతుంది. పెద్దయింతర్వాత, హోదా, డబ్బు కాపాడతాయి – అని సమర్థించుకుంటూ గదిలో కొచ్చేటప్పటికి, 'నానీ' గది వూడుస్తోంది. అతను రాగానే నిలిచి నవ్వింది. అతను కోపంగా చూశాడు.

"ఇదిగో – ఇంటద్దె – అయ్యగారికి – హొన్నప్పగారికి ఇచ్చిరా" అని పర్సులో రూపాయలనోట్లు తీసిచ్చాడు. కుడిచేతిలో చీపురు ఎడం చేతిలోకి ఫిరాయించి తొడమీద తుడుచుకొని, అరచెయ్యి ముందుకు చాచింది. చేతికి రెండంగుళాల పొడుగున, ప్లాస్టిక్ గాజులుండటం చూశాడు – ఎర్రవీ, పచ్చవీ, నల్లటివీ. వాటికేసి చూసి నవ్వుతూంది.

"తెలిసిందా?"

తెలిసిందన్నట్లు తల పంకించింది. నోట్లు తీసుకుంది. ఊడవడం పూర్తిచేసి వెళ్ళింది. ఆమె చేతికి ఆ గాజులు బాగుండలేదు. అల్ల బోడిగా వుంటేనే బాగుంటుంది. గదిలో వొంటిగా వుండటం వల్లనేగా, యీ ఆలోచనలు. బైటికివెడితే, ఏదీవుండదు.

రాత్రిళ్లు నిద్రపట్టదు. ఏవేవో ఆలోచనలు. రెండో ప్రపంచ సంగ్రామం – క్విట్ ఇండియా ఉద్యమం – హిట్లర్ దంపతుల ఆత్మహత్య 'క్రిప్స్' మిషన్, నౌవకాలీ, మహాత్ముని నిర్యాణం, రిపబ్లిక్ దినోత్సవాలు. మూడు కోతులు – బల్లమీద రబ్బరుబొమ్మ – గదివూడుస్తూ 'నానీ'. ఊహ విశాలమైందంటారుగాని, శరీరం ఎంత సంకుచితమైందో, ఊహకూడా అంతే. మానవుడి మెదడుకొలతెంత? ఆరంగుళాల పొడవు – వెడల్పు. ఊహకూడా అంతే. గిరగిర తిరిగి మళ్ళా అక్కడికే చేరుకుంటుంది. రక్తం, నరాలు అవయవాలు మెదడును, ఊహని కట్టిపడేస్తాయి. అనంత విశ్వాన్ని పాలిస్తున్న పరమాత్మ ఆత్మస్వరూపం దాల్చి ఈ కాస్త శరీరంలో దాగివున్నాడంటే నమ్మలేకుండా ఉన్నాడతను.

ఆ మొర్నాడు ఉదయం అలిమేలు అతని గదిలోకొచ్చి రెండురూపాయలు తిరిగి ఇచ్చివేసింది – తను అద్దెతోపాటు, ఈ రెండూ అదనంగా యిచ్చాడుగనక. పోనీ మీ అమ్మాయిని తీసుకోమను అందామనుకున్నాడు గాని, తనే స్వయంగా ఇద్దామని నిర్ణయించుకుని ఆ రెండూ తీసుకున్నాడు. నానీపై కోపమూ, జాలీకూడా కలిగింది. చాలా అమాయకురాలు – ఏమీ గ్రహించలేదు. నవ్వుతుంది – ఊహాలేని భాగ్యురాలు; డబ్బుతో నిమిత్తంలేని పవిత్రమూర్తి; కామాని కతీతమైన సుకుమారి. చెడు చూడదు; వినదు; చెప్పదు. మూడుకోతుల నీతిని జీర్ణించుకొన్న త్రిమూర్తి!

ఆ రాత్రి మోహన్‌బాబుకి నిద్రపట్టలేదు. కొరియా పరిస్థితిని గూర్చి ఆలోచించాడు. అంతర్జాతీయ కార్మికసంస్థని గూర్చి ఆలోచించాడు. ఈజిప్టు వ్యవహారం గూర్చి తీవ్రంగా ఆలోచించాడు. వాటికి యధార్థానికున్న వొత్తిడిలేదు – ఆ ఊహాచక్రానికి కేంద్రంలేదు. ఈజిప్టు, కొరియా, జేనీవా – అవన్నీ భూగోళ శాస్త్రపటంలో మచ్చలు, పత్రికలలో అక్షరాలు, ఉపన్యాసవేదిక నుండి వెలువడే ధ్వనులు.

దోమ ధ్వని చేస్తోంది. అనేకం దోమలుంటే వాటిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాడుతాను – కాని ఒక్కటేవుంటే అతను అసహాయుడు. ఎటునుంచో వొస్తుంది. ఎక్కడ వాలకూడదో అక్కడ వాలుతుంది. రోదిస్తుంది నిష్క్రమిస్తుంది.

లేచాడు – వరండాలోకి నడిచాడు. చెట్టుకింద నిలబడ్డాడు. ఆకులు కదుల్తున్నాయి– కొబ్బరిచెట్లు గుర్రెడుతున్నాయి. మందారం ఎర్రశాలువా కప్పుకుంది. అవతల గదివైపు వెళ్ళాడు. కిటికీలోంచి నీడలు పడటంలేదు. దీపంలేదు. అంతా చీకటి – ఆకాశంలో నక్షత్రాల కర్థం కాని చీకటి. గది ముందు మెట్టుమీద కూర్చున్నాడు. రాత్రుళ్ళే ప్రాణం హాయిగా వుంటుంది; తన నిజస్వరూపం తనకి తెలుస్తూ వుండే సమయం అదొక్కటే. 'నువ్వెవరవో తెలుసుకో' అంటాయి వేదాలు. ఆ పనిరాత్రే సాధ్యమవుతుంది. తనెవరు? ఏమో!

గదిలోంచి కంఠాలు వినబడుతున్నాయి. అతను ఉలిక్కిపడి, గోడ దగ్గరగా జరిగాడు. పురుషుడికంఠం – అతనికి తెలుసు. హొన్నప్పగారబ్బాయి, మాధవరావుది ఆ కంఠం. ఆ రెండోది స్త్రీకంఠం! మాటలు తెలియడంలేదు – ఏదో చప్పుడు, గాజుముక్కల గొట్టం తిప్పినప్పుడు అందులో గాజు ముక్కలు సన్నగాచేసే చప్పుడికి మల్లే ఎన్నడూ లేంది. ఆ ఉదయం 'నానీ' చేతిని ప్లాస్టిక్ గాజులు చూశాడు. ప్లాస్టిక్ గాజులు చప్పుడు చేస్తాయా?

అతను సరిగ్గా చూడలేదు. ప్లాస్టిక్ గాజులు కావేమో! మళ్ళా చప్పుడు నిలిచిపోయింది. ఒకటి రెండు ఇంగ్లీషు మాటలుకూడా వినబడ్డాయి. 'నానీ'తో ఇంగ్లీషా! లోపలికిచూస్తే, దీపంలేదు. లోపల చీకటి. తను అట్లాంటివి చూడొచ్చా? కళ్ళు మూసుకుని చూడొచ్చునేమో. ఏదో చప్పుడు – ఒక్కడుగు వేసిన చప్పుడు. భయమేసింది. లోపలికొచ్చాడు. మంచంపై వాలాడు. నిద్రరాక నరాలు నీరసించి శరీరం తనే నిద్రపోతుంది. దాన్ని విడిచేసి ఊహాయాత్ర సాగించాడు. విశ్వం అనంతంకాదుట ఒకచోటునుండి తిన్నగా ప్రయాణంచేస్తే ఎప్పుడో అప్పుడు నిజస్థానానికి చేరుకోవడం తథ్యంట. విశ్వం, సమయానికి బంధింపబడి, రెండూ కాస్తంత వొంగి ఏకమయ్యాయిట. ప్రథమ ముద్దుకోసం పెనుగులాడుతున్న ప్రేమికుల అధరాలకిమల్లే. స్థలం ప్రియుడు, కాలం ప్రేమసి –

వారు విడివిడిగా వుంటే సంతానం వుండును. కలిసివుండటంవల్ల, ఫలితంలేదు. జీవితానికి, అర్థంలేదు, ప్రేమకివుందేమోగాని! అది భౌతిక, ఖగోళశాస్త్రాల నిర్వచనం. తను తిరిగి 'నానీ' దగ్గరకే వొచ్చాడు. చీకట్లో మూడుకోతుల బొమ్మ కనబడటంలేదు. నైతికవిలువలను పాటించనక్కర్లేదు. కళ్ళు మూసుకున్నాడు. తెల్లవారింది.

'నానీ' ఊడవడాని కొచ్చింది. ఆమెకేసి పరీక్షగా చూచాడు. కళ్ళు తేటగా మెరుస్తున్నాయి. పళ్ళు తెల్లగా తళుక్కుమంటున్నాయి. అప్పుడే ఉదయించిన సూర్యబింబంలా వుంది – ఎడారి అంచున లేచిన సూర్య గోళంలా స్ఫుటంగా, తీక్షణంగా ఆమెలో ఏ మార్పులేదు. అద్దంలో తన మొహం చూసుకున్నాడు. ఏమిటా గీట్లు! ఒంటే మంద నడవగా ఏర్పడిన ఎడారి జాడలకిమల్లె, వర్షానికి బురదైన నీటిగుండంకిమల్లె.

ఆమె వొంగివూడుస్తుంటే బల్లకింద ఏదోపడిపోయినట్లు మోకాళ్ల మీదపడి, వొంగి ఆమె చేతిగాజులు పరీక్షగాచూశాడు. కొంచంగా చప్పుడు చేస్తాయి. రంగుగాజుల గొట్టం తిప్పినట్లు మరోటి చూశాడు – మెడలో ఎర్రపూసలతాడు.

"కొన్నావా?"

అవునన్నట్లు తలవూపింది.

"ఎక్కడ?"

నవ్వుతుందేం?

"మాట్లాడవేం?"

ఆ మూలకి వెళ్ళింది. వెనకభాగం – చీరలోంచి పిరుదల ఆకృతి కనబడుతోంది – తను ఎగ్జిబిషన్‌లో చూసిన శిలా ప్రతిమకి మల్లే.

"ఎప్పుడేనా సినిమాకి వెడతావా?"

తలవూపుతుంది.

"వెడతావా?"

బైటికి వెడుతోంది. సంజ్ఞచేసి నిలిపాడు.

"ఇవిగో రెండురూపాయలు – సినిమా కెడతావనిచ్చాను. మీ అమ్మకి చెప్పావా? ఇంకెప్పుడూ అల్లా చెయ్యకు."

అమ్మో! అన్నట్లు కళ్ళు పెద్దవిచేసింది. అతనికంఠం బొంగురు పోయింది. ఎండినట్లు మాట తడబడుతోంది. రూపాయిలు చేతులోపెట్టి, వేళ్ళు మడిచి నొక్కాడు.

"ఫరవాలేదులే. ఏదేనా కొనుక్కో."

తీసుకుంది. "అమ్మయ్య" అనుకొన్నాడు.

ఎందుకిచ్చినట్లు ఆ డబ్బు తను? మొదటిరోజున అద్దె యిచ్చేటప్పుడు, ఆ రెండురూపాయలూ అదనంగా చేతులోపడ్డాయి. ఇచ్చిచూశాడు - ఏమౌతుందోనని, రూపాయకోసం కొట్లాడుకోడం, ఖూనీలు జరగడం పత్రికలలో చదువుతాం. అలిమేలుకి డబ్బుకాపీర్నంలేదు. ఆ రెండు రూపాయలూ తిరిగి యివ్వడంలో డబ్బుపట్ల ఆమె నిజాయితీ తెల్లమౌతోంది. ఎందుకిచ్చినట్లు? ఆమెని సంతోషపెట్టాలని తప్ప మరో ఉద్దేశం అతనికి కనబడలేదు.

ఆ సాయంత్రం కాలక్షేపం అవక సినిమాకి బైలుదేరాడు మోహన్‌బాబు. అతను హాల్లోకి వెళ్ళేటప్పటికి ఆట ప్రారంభమైంది. అది ఇంగ్లీషు చిత్రం. జనం మధ్యమధ్య పెద్దగా నవ్వుతున్నారు. ఎందుకో అతను అందులో లీనం అవలేకపోతున్నాడు. చూస్తున్నాడు. వింటున్నాడు - కాని అదేమీ అవగాహన అవడంలేదు. మనస్సు ఎటో విహరిస్తోంది. సగం మనస్సు సినిమాకథలో లగ్నంచేసి, మిగతా మనస్సుని వేరేచోటుకి పంపగలగడం వింత అనుభవం - అట్లా జరుగుతోందని గ్రహించడం మరీ విచిత్రమైన అనుభవం. జనంతోపాటు అతనూ మధ్యమధ్య నవ్వుతున్నాడు - చీకట్లోకూడా సమూహాల ఉద్రేకానికి లొంగిపోవడం తమాషాగా ఉంటుంది. పదిమందితోనూ పంచుకునే ఆనందం వేరు - వ్యక్తిగా, ప్రత్యేకంగా ఆనందం పొందడం వేరు. ఏకాంతంగా పొందిన ఆనందంలో ఔన్నత్యం, నిండుతనం, సామాజిక అనుభూతిలో లోపిస్తాయి కాబోలు అనుకుంటూ వుండగా ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి. జనం నిట్టూర్చి, సిగరెట్లకి, 'టీ'కి బైటకి కదిలారు. హాలంతా పరకాయించి చూశాడు. దూరంగా వెనకాల సీట్లో హొన్నప్పగారబ్బాయి మాధవరావు - కనిపించాడు. అవును, అతనే. అతను తనని చూడకుండా పక్కకి మొహం తిప్పివేశాడు మోహన్‌బాబు. అతను చూడకుండావున్న సమయంలో చూస్తూ, ఎందుకు? ఏమో అతనికే తెలియదు. కొన్నిచేష్టలకి అర్థమే వుండదు. మళ్ళా చూశాడు. మాధవరావు ప్రక్కనొక స్త్రీ కూర్చుంది. మనిషి నలుపు - కాని నాజూకుగా, చదువుకున్నదానిలా కనిపిస్తోంది. చెక్కిళ్ళపైన ఏదోకాంతివుంది. ఆమె చెవుల దుద్దులు మెరుస్తున్నాయి. అవి వజ్రాలదుద్దులు.

ఎవరామె?

తన పక్కసీట్లో ఆంగ్లో ఇండియన్ స్త్రీ కూర్చుని ఉంది. అల్లాగే కాకూడదూ. కాని మాధవరావు చనువుగా. దగ్గరగా కూర్చున్నట్లు స్ఫురించింది. స్ఫురించడమేమిటి? వారిద్దరూ మాట్లాడుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు.

సిగరెట్లు పారేసి జనం లోపలికి జొరబడ్డారు. హాలంతా వొంటి దీపం వెలుగులో, పొగమసగలో. తుఫాను చెలరేగిన సముద్రంలో చిన్ని పడవలా అతనికళ్ళముందు వూగిపోతోంది. మళ్ళీ చీకటి, చేపలవాళ్ళ వలలా - చిత్రం కొనసాగింది - మధ్య మధ్య విరగబడి నవ్వడాలు ప్రారంభమైనాయి. మోహన్‌బాబుకి వొళ్ళుమండుతోంది. ఆపైకి నవ్వడం ఎందుకు? లోలోన ఆనందించకూడదూ?

ప్రేయసితో ఏకాంతంగా ఏ కాలవగట్టునో, ఉద్యానవనంలోనో విహరించక, జనం మధ్యకి రావడంలో ఏం ఆనందం వుందో అతనికి అర్థంకాక ఆ నవ్వేజనంపై విసుక్కున్నాడు.

ఆ కోపం చిత్రంపైకి మరలింది. దేశంలో నేటి నైతిక అరాజకత్వానికి కొంతవరకూ ఇంగ్లీషు చిత్రాలు కారణం. పాశ్చాత్యుల స్వేచ్ఛా ప్రవర్తన, శారీరక సుఖాల అన్వేషణ, ఆధ్యాత్మిక చింతన రాహిత్యమూ, నేటి యువతీయువకులను భౌతిక సౌందర్యాన్వేషకులుగా మార్చివేసినాయి. వారు ఇంట్లో నిత్యజీవితంలో పొందలేని అనుభూతి, ఇంగ్లీషు చిత్రాలలో రహస్యంగా పొందుతున్నారు. యువతీయువకులు మాత్రమే ఏమిటి? వారు అది అన్వేషించడం సహజం, మంచిదికూడా, పెద్దలుకూడా, వయస్సు మళ్ళినకొద్దీ, యీ రకం అన్వేషణ తీవ్రరూపం దాలుస్తుంది. వృద్ధులు కూడా, ఈ చిత్రాలని విరగబడి చూస్తున్నారు. చాలామందికి సడలి, హరించుకుపోతున్న తమ వ్యక్తిత్వాలకి ఈ సినిమాలే శరణ్యం.

మన ప్రదర్శకులు యీ రహస్యం కనుక్కున్నారు. మన చిత్రాలలో, పాశ్చాత్య సంగీతరీతులు, నృత్యసంప్రదాయాలు, శృంగార చేష్టలు, వీటిని ప్రవేశపెట్టి, జనసామాన్యం జోహారుల నందుకుంటున్నారు. కుబేరులవుతున్నారు. ఇదొక మతంగా ప్రబలుతోంది. ఈ పాశ్చాత్య చిత్రాల దిగుమతిని ప్రభుత్వం నిషేధించి మతసామరస్యం ఎందుకు పెంపొందించినదో? అది ప్రజాస్వామ్య సిద్ధాంతానికి విరుద్ధం. కళారంగంలో అసలు కూడదు. అరాజకత్వంలోంచిగాని కళ జనించదు, పెరగదు.

సినిమా అయింది. జనం లేచారు. వారు వొక్కసారిగా వొదిలేసిన శ్వాస హాలును చుట్టుముట్టింది. బైటపడ్డాడు మోహన్‌బాబు. మాధవరావు, అతని ప్రక్కన కూర్చున్న దుద్దులమ్మాయి ముందు నడుస్తున్నారు. వారి వెనకాలే నడుస్తున్నాడు. టాక్సీ, రిక్షా, వాళ్ల ఆహ్వానాలు కాదని, వారివెనకనే తనూ నడుస్తున్నాడు. నాలుగైదు ఫర్లాంగులు వెళ్ళారు. సందులోకి తిరిగారు. తనూ తిరిగాడు. మాధవరావు నిలిచిపొయ్యాడు. ఆ అమ్మాయి మాత్రం నడిచి వెళ్ళింది. మరో అరఫర్లాంగు నడిచి ఒకింట్లోకి వెళ్లింది. ఆమె ఇల్లే కాబోలు. మాధవరావు వెనక్కి తిరక్క పూర్వమే, గబగబ నడిచి ఇంటికి చేరుకున్నాడు మోహన్‌బాబు. తలుపు వేసి దీపం ఆర్పి కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాడు. మాధవరావొచ్చి, తన గదిలోకి వెళ్ళడం చూశాడు. ఆ అమ్మాయి ఎవరో? రాత్రి తను మాధవరావు గదిలో మాటలు విన్నాడు. అందులో రెండో కంఠం స్త్రీది. సినిమాకొచ్చిన అమ్మాయిదే అవాలి. నానీది మాత్రం కాదు. అమ్మయ్య అనుకున్నాడు.

నిద్రపట్టేముందు తాగి పరున్నాడు మోహన్‌బాబు. రెండు మూడురోజుల్లో మరో విషయం జరిగింది. హొన్నప్పగారు ఏదోపనిమీద మైసూరు వెళ్లారు. మధ్యాహ్నం రెండైంది. అన్నపూర్ణమ్మగారు నిద్రపోతోంది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. మోహన్‌బాబు పరుందామని మంచంమ్మీద పక్క సర్దుతున్నాడు. బైట గేటుముందు ఏదో చప్పుడైంది. పోస్టువాడేమోనని చూశాడు అలిమేలు. తిన్నగా పక్కగదిలో కెళ్ళింది – అది మాధవరావు గది. ఎందుకో? తలుపు తాళంచెవి సందులోంచి చూస్తున్నాడు – మోహన్‌బాబు. అతని గుండెలు వేగంగా

కొట్టుకుంటున్నాయి. మధ్య తన కెందుకు బాధ. శరీరంపై తనకెల్లాంటి యాజమాన్యము లేకపోవడం చిత్రంగా ఉంటుంది. మనుషుల అలజడి - రెండో వ్యక్తి గదిలోకి వెళ్ళాడు. అతను మాధవరావు. రెండుమూడు నిముషాలలో అలిమేలు ఇవతల కొచ్చేసింది. అమ్మయ్య అనుకొని నిట్టూర్చాడు మోహన్‌బాబు. అలిమేలు వెళ్ళింది. మాధవరావు గది గడియపెట్టిన చప్పుడైంది. మోహన్‌బాబు పడుకున్నాడు. కాలం జరగదు. ఏమీ జరగదు. విసుగు పుడుతుంది. జీవితం పట్ల నిష్కారణంగా విసుగు పుడుతుంది. ఔరంగజేబుని గురించి ఆలోచించాడు. అతని కొడుకు. వారి ప్రేమ కలాపాలు, సింహాసనం కోసం కొట్లాటలు, యుద్ధాలు. ముంతాజ్ బీగమ్ తాజ్‌మహల్‌లో శాశ్వతంగా పవ్వళించింది. జీవితంలో ఏమి చూసిందో మృత్యువులోనూ అదే - విసుగు.

ఓ గంట కాలక్షేపం చెయ్యడం చేతకాని యీ మనుషులు అమరత్వాన్ని, కోరతారెందుకో! వేదాంతులు, వారి సిద్ధాంతాలు - పరమాత్మలోంచి పుట్టుకొచ్చాడుట యీ మనిషి - మళ్ళా పరమాత్మలోకే వెడతాడుట - ఆ తలుపు తెరుచుకుని, యీ చీకట్లో క్షణం వుండి, మళ్ళా ఆ రెండో తలుపు తెరుచుకుని పరమాత్మలో ఐక్యమై అమరత్వం పొందుతాడుట! ఎంతవెర్రి - కాలక్షేపం కాని వేదాంతుల కల్పన యీ అమరత్వం.

లేచేటప్పటికి నాలుగైంది. బైటికెళ్ళి టీత్రాగి వొచ్చాడు. సాయంత్రం కనుక్కోడానికి నానీ రాలేదు. జ్వరం వొచ్చిందిట. అలిమేలే వొచ్చింది. అన్నీ సర్ది. కారియర్ తీసుకెళ్ళింది. ఐదుదాటింది. ఆరవుతోంది. మాధవరావు ముస్తాబై, బైటకెళ్ళాడు. తెల్లపాంటు, లోపలికి మడచిన చొక్కా, బెల్టు, మధ్య పాపిడితీసి వెనక్కి దువ్విన క్రాపింగు - బాగానే వుంటాడు. బత్తాయి పండురంగు, ఆ రకం పచ్చదనం తన కిష్టం లేదు. దెబ్బతిని, కాస్త వొడిలి, నలిగిన బత్తాయిపండులా, జారిన దవడలూ, రంగూను.

మోహన్‌బాబు కూడా బైలుదేరాడు. గూడకట్టు, లాల్చీ, పైన తువ్వాలు - నిరాడంబరంగా వుండాలి వస్త్రధారణ. తెల్లఖద్దరు బాగుంటుంది. మాధవరావు వెనకాలే నడుస్తున్నాడు. అసలు అల్లా వెళ్ళాలి అనుకోలేదు. కాళ్ళు అటు తీసుకెడుతున్నాయి. మళుపు తిరిగాడు. ఇతనూ తిరిగాడు.

అదేదో కాఫీహోటల్లోకి వెళ్ళాడు మాధవరావు. ఇతను వెళ్ళలేదు. దూరంగా చెట్టుకింద నిలబడి, మేడమీద ఉంచి వొస్తున్న రేడియోపాట వింటున్నాడు. మాధవరావు బైటకొచ్చాడు. అతని చేతులో పొట్లంవుంది. టిఫిన్ పాకేజి. మళ్ళీ ఇద్దరూ నడుస్తున్నారు. చీకటి పడుతోంది. ఇంక విద్యుత్ దీపాలు వెలగడం తరవాయి, ఆ గుమ్మంముందు నిలిచాడు మాధవరావు. తలుపు తీసింది తనెరుగున్న మొహమే అలిమేలు. గుమ్మం బైటకొచ్చింది దాటి మరో మొహం తలుపు సందులోంచి కనబడింది. ఆ సినిమాలో రోజున చూసిన వజ్రాలదుద్దులు ధరించిన అమ్మాయిలాగుంది. లాగులేదు, చొక్కాలేదు- ఆ అమ్మాయే!

మాధవరావు లోపలికెళ్ళాడు. తలుపు గడియేసింది అలిమేలు.

అలా చూస్తూ ఎంతసేపు నిలబడ్డం? ఈ చివరనుంచి ఆచివరదాకా ఎలక్ట్రిక్ దీపాలసంఖ్య లెక్కపెడుతూ నడుస్తున్నాడు. కాలక్షేపానికి ఆ చెట్టుమీద వొక కొమ్మకున్న

ఆకులు లెక్కించాడు. కనబడ్డం లేదు. ఆకుల మధ్య పక్షులు స్థావరం కోసం కీచులాడు కుంటున్నాయి. ఇళ్ళ సమస్య తీవ్రమైనది. మనుషులకంటే ప్రణాళికలు, మేస్త్రీలు, పథకాలు ఉన్నాయి. పక్షులకో – బలవంతులకే ఇళ్లు. ప్రేయసిని ఆ కొమ్మపైనే కొంచం దూరంగా వుండనిస్తుంది.

తలుపు తెరిచారు. కీనీడలో సరిగ్గా కనబడటంలేదు. అతను మాధవరావు – వెనక దుద్దులమ్మాయి – వేగంగా నడిచి ఇంటికొచ్చేశాడు. మోహన్‌బాబు ఆ దంపతులు సినిమా కెడుతున్నారా? షాపింగ్ కెడుతున్నారా? అలిమేలుకు ఏం సంబంధం?

ఇంటిముందు గేటుతీసి వరండాలోకి రాగానే అన్నపూర్ణమ్మగారు ఉయ్యాలబల్లమీద కూర్చోడం చూశాడు. కిటికీ ముందు 'నానీ' కారియర్‌తో కూర్చుంది. తన గది తలుపు తీశాడు. నానీ లోపలికొచ్చింది. కారియర్ మూలపెట్టింది.

"నీకు జ్వరం అంది మీ అమ్మ?" అన్నాడు.

"అమ్మెవరు?"

"అలిమేలు?"

"కాదు, పిన్నమ్మ."

"ఓ!"

"ఊ" అన్నదామె. నవ్వుతుంది.

ప్రపంచంలో చెడుగు, భయం, భారం, బాధ ఆమెకి పట్టినట్లులేదు. ఆమె జగత్తులో మొగాడు – మొగాడివల్ల వొచ్చే దురంతాలు లేనట్లున్నాయి.

"జ్వరమా?"

"పిన్నమ్మకా?"

"ఛ, ఛ, నీకు."

"నాక్కాదు అక్కయ్యకి."

"అక్క యెవరు?"

"అక్క – మా అక్కయ్య."

"నాకేం తెలుసు? తెలుగు బాగానే వొచ్చే."

"మేం తెలుగారిమే."

"మరి రానట్టు మాట్లాడతావేం?"

"మీలా రాదు. కాస్త వొస్తుంది బాగా" వెడుతోంది.

"ఆగు."

ఆగనన్నట్టు తలవూపింది. గబగబ నడిచి వెళ్ళింది. ఆ పిల్ల దగ్గర నుండి తెలుసుకోవల్సినవి చాలా ఉన్నాయి. మంచి సమయం చిక్కింది. తను ధైర్యంచేసి చెయ్యిపుచ్చుకుని ఎందుకు నిలపలేదు? ఏదో అభిమానం – హోదా, అంతస్తు గురించి పట్టింపు – దాన్నుండి జనించే బిగింపు. ఎప్పుడో అప్పుడు చొరవచేసి ఆమెని నిలేసి, నాలుగు విషయాలు అడిగెయ్యాలి. ఏమిటా నాలుగు? నవ్వొచ్చింది. మూడు కోతులు, నాలుగు విషయాలు!

ఆ రాత్రి అక్కడ వుండబుద్ధి పుట్టలేదు. భోజనం అయ్యాక మిత్రుడు చౌడప్ప గారింటికెళ్ళి, కబుర్లు చెప్పుకుని పరున్నాడు.

ఉదయం గదికొచ్చేటప్పటికి ఎనిమిదైంది. హొన్నప్పగారు కనిపించారు. ఊరునుంచి వొచ్చినట్లున్నారు. గదంతా చిందరవందరగా వుంది. సర్దడం మొదలెట్టాడు. గోడదాటి గేటు ఇవతలకి ఐదారుకోతులొచ్చాయి. హొన్నప్పగారు వాటిని తరుముతున్నాడు. కొన్ని చెట్లెక్కి గంతులేస్తున్నాయి. నల్లమొహం కోతులు, పొడుగాటి తోకలు - నల్ల మొహంచుట్టూ, ఊదారంగు చర్మం - చిరువెంద్రుకలు అతనికేసి చూస్తోంది. ఆ కోతిపిల్ల, మనిషికీ వాటికీ దగ్గరసంబంధం, బాంధవ్యం నెలకొల్పమని జాలిగా చూస్తోంది. అరటిపండు పడేశాడు. ఆనందంతో లాక్కుపోయి తింటున్నాయి. తీసుకొన్న కోతే మిగతా వాటికిపంచాలి, వాటిల్లోనూ భూస్వామితత్వం యజమానితత్వం.

గది బాగుచెయ్యడానికి అలిమేలొచ్చింది.

"నానీ కెల్లావుంది?"

"బాగానేవుంది - బద్ధకం - వొల్లు బద్ధకం."

"నిన్న సాయంత్రం వొచ్చింది?"

"నాకు పనుంది. దాన్ని రమ్మన్నా."

"జ్వరం ఎవరికి?"

"జ్వరం ఏమిటి? ఎవరికీ లేదు."

"అక్కయ్యకిట."

"ఓ, అదా - అవును. సాయంత్రం డాక్టర్‌కి చూపించా."

"ఏమన్నాడు?"

సమాధానం చెప్పదు. నవ్వింది. పని పూర్తిచేసి వెళ్ళింది.

పదిగంటలైంది. వీధిలోకి బండి వొచ్చింది. అందులో అన్నపూర్ణమ్మగారెక్కింది. నానీ కూడా వొచ్చింది. రోడ్డు మీదనుంచే, తనూ బండిలో ఎక్కింది. హొన్నప్పగారు సాగనంపి గేటుమూసి, లోపలికెళ్ళాడు.

మోహనబాబు స్నానానికి బైలుదేరాడు. మండువాలో తడక వెనక ఎవరో మాట్లాడుకోడం విన్నాడు.

"అబ్బాయి పట్నం వెడతాడు - మరో రెండొందలు" అది హొన్నప్పగారి కంఠం.

"ఈ నెల డాక్టర్లకవుతోంది."

అది అలిమేలు కంఠం. ఇంక మరి వినకూడదు, గదికెళ్ళి స్నానం చేసి ముందుగదిలో కొచ్చాను. గది దక్షిణంవైపు తలుపు గడియెట్టుకుండా, దగ్గరగా జార్లవేసి వెళ్ళాడు. వొచ్చేటప్పటికి తెరిచివుంది. అటూయిటూ చూశాడు. ఏమీపోలేదు. తలుపులు మూశాడు. తల దువ్వుకుంటున్నాడు. అతనికంతా గంద్రగోళంగా వుంది. విషయం సగంసగం తెలియడంవల్ల కలిగే చిరాకు ఆవరించింది. తనెందుకు వినడం? ఎందుకు చూడడం? వింటున్నదీ, చూస్తున్నదీ మంచి విషయాలుగాలేవు. కోతుల బొమ్మకేసి చూశాడు. అక్కడలేదు. బల్లకింద చూశాడు. మంచం కింద చూశాడు. ఎక్కడా లేదు.

గదంతా చూశాడు. గది బైటకొచ్చాడు. ఏమైంది? ఎట్లా పోయింది? ఎవరు తీశారు? చెట్లపైన కోతులు గంతు లేస్తున్నాయి. వాటికేసి చూశాడు. ఒకకోతి చేతిలోవుంది. కోతుల బొమ్మ అవును. బల్లమీద బొమ్మ పక్కనే మరో అరటిపండు వుంచాడు. ఆ పండూ, ఈ బొమ్మ గదితలుపు తీసిలాక్కు పోయింది కోతి. తినేది అనుకుంది కాబోలు తమ సంతతిని లాక్కుపోకేంచేస్తుంది?

బెదిరించాడు, రాళ్ళు విసిరాడు. కోపంగా చూస్తున్నాయి కోతులు. మూతివిరుపులు, కోరచూపులు – అసంతృప్తి ప్రకటిస్తున్నాయి. దూకుతున్నాయి, జైలుకెడుతున్నాయి. లోపలి కొస్తున్నాయి, మీదపడి పీకవుకదా! లోపలికొచ్చి, కిటికీతలుపు మూశాడు. మంచంమ్మీద పడుకున్నాడు. ఆంజనేయ దండకం చదవాలంటే అతనికిరాదు. రాముడు, సీత, లంక, సుగ్రీవుణ్ణి గురించి ఆలోచించాడు. డార్విన్ సిద్ధాంతాన్ని వాల్మీకి ఏనాడో వ్రాసిపారేశాడు, చిత్రం!

మరో గంటలో అన్నపూర్ణమ్మగారు, 'నానీ' బండిలో తిరిగి వొచ్చారు. పెద్దామె లోపలకెళ్ళింది. బుట్టలో పళ్ళు, పొట్లాలు. లోపల పెట్టింది నానమ్మ. హొన్నప్పగారు బండివాడికి డబ్బులిచ్చి పంపించారు.

మోహన్‌బాబు భోజనంచేసి 'నానీ' కోసం చూశాడు. ఆమె ఇంటికి వెడుతూ గేటు దగ్గర కొచ్చింది. కిటికీ కేసి చూసింది. రమ్మని సంజ్ఞచేశాడు. వొచ్చింది. కోతికేసి చూపించాడు.

బల్లమీద వుండేది – బొమ్మ. అదిగో అది నోట్లో కరుచుకుంది. ఎట్లాగో – ఏమన్నా చెయ్యగలవా?"

ఇంట్లోకి వెళ్లింది నానీ. తినేది ఏదో చేతులో పట్టుకుంది. చెట్టు కిందకెళ్ళి కోతికి చూపించింది. కోతిపిల్లకింది కొమ్మమీదికి దూకింది. వెనకాల పెద్దకోతి చూస్తోంది. చిన్నది ఆమె చేతులో పదార్థం తీసుకుంది. దానిమీద పడిన పెద్దకోతి నోట్లో బొమ్మ కిందపడింది. నానీ తీసుకుంది. నవ్వుకుంటూ లోపలకొచ్చింది. బల్లమీద పెట్టింది.

"బాగానే మచ్చిక చేసుకొంటావే" అన్నాడు. తలుపు దగ్గరగా మూసి గుమ్మం మధ్యగా నిలబడుతూ.

'కోతంటే ఏం భయం?"

"నీకు మనుషులంటేనే భయంకాదూ" అన్నాడు నవ్వుతూ ఆ వాక్యానికి అర్థం ఏమిటో అతనికే తెలియదు. తలవూపింది నవ్వింది. వెళ్ళడానికి తలుపు దగ్గరకొచ్చింది.

"వెళ్ళాలి."

చెయ్యి పట్టుకున్నాడు విదిలించింది.

"అమ్మో" కళ్ళు పెద్దవిచేసింది. కంటిపాప కిటికీకేసిచూస్తూ, కొనలకి కదిలింది. పెదవులు బిగించింది. అతనికి ఆ దృశ్యం చూడడం ఇష్టం.

"గాజు లెక్కడివి?"

"అక్క పట్నంనుంచి తెచ్చింది."

"నీ అక్క పట్నంలో పనిచేస్తోందా?"

"చదువుకుంటోంది."

ఆశ్చర్యపడ్డాడు. "మరి నువ్వు చదువుకోవేం?"

"నా కెవరు చెప్పిస్తారు?"

"మీ అమ్మ."

"అమ్మకాదు, పిన్నమ్మగా. కూతురు గనక రాజమ్మకి చదువు."

"అక్కపేరు రాజమ్మా? అంటే అలిమేలుకూతురా?"

తలవూపింది. జెడ వెనక్కి తోసింది.

"అంత డబ్బెక్కడిది?"

"పిన్నయ్య గణించిపొయ్యాడు."

"ఏం పని?"

"యుద్ధంలో ఇనుము."

"మరి అలిమేలుకి ఇళ్ళల్లో పనేం కర్మ?"

"చిన్నప్పటినుంచీ చేస్తావుంది"

"మరి నీకు చదువు చెప్పించదా?" తల వూపింది.

"మా అమ్మ, అయ్యలేరు. పిన్నమ్మ చూస్తుంది."

మరి, మరి... పెళ్ళి?"

కళ్ళు పెద్దవిచేసింది.

"నీక్కాదు. రాజమ్మకి."

నవ్వుతూంది. "వెళ్ళాలి."

అతను కదలలేదు. దక్షిణం తలుపు తెరుచుకుని పరుగెత్తి కెళ్ళింది. ఆమె పిరుదులు, వక్షానికి లయ కల్పుతున్నాయి. కదిలే శిల్పం. కాలక్షేపం అవక జీవితంమీద విముఖత పుట్టిన వారందరూ, తలకాయలు కొట్టుకొని చనిపోయేటందుకు అనువైన శరీరం ఆమెది.

మరో రెండురోజు లయ్యాకగాని మళ్ళా నానీతో మాట్లాడే అవకాశం చిక్కలేదు మోహన్‌బాబుకి.

కారియర్ తెచ్చేటప్పటికి సాయంత్రం ఏడుదాటింది. 'నానీ' కారియర్ కిందపెట్టగానే ఎలక్ట్రిక్ దీపం ఆర్పివేశాడు. మోహన్‌బాబు. ఆమె తలుపు తెరవబోయింది. ఇవతలకిలాగి తలుపుమూశాడు. ఆమె వక్షం, అతని భుజానికి తగిలింది. ఆమె ఒక్క గంతేసి దీపం స్విజ్ నొక్కింది.

"చీకటంటే భయమా?"

"వెళ్ళిపోతా."

"కాసేపు మాట్లాడాలి."

"దీపం ఆర్పడం ఎందుకు?"

ఏమో అతనికేమీ తెలీదు. రహస్య విషయ పరిశోధనకి మాత్రం వెలుగు తగదు కాబోలు.

"నిన్నెవరూ చూడకండా" అన్నాడు.

"పిన్నమ్మ చంపేస్తుంది."

"ఎందుకు?"

"ఆలస్యంగా యింటికెడితే, యింకేమన్నా వుందీ."

"నేను పనిమీద వుంచానని చెప్పు."

"భయం."

"నేనంటేనా?"

నవ్వుతోంది.

"రాజమ్మ విషయం చెప్పు. ఏం చదువుకుంటోంది?"

"నాకు తెలియదు. పట్నంలో చదువుతోంది. మావయ్యగారితో కలిసి"

"మావయ్యెవడు?"

"మావుగారు. అన్నపూర్ణమ్మగారబ్బాయి."

అతనికి బోధపడుతోంది. అలిమేలు భర్త యుద్ధం రోజుల్లో ఇనప వ్యాపారంలో బోలెడంత గడించాడు. తరవాత చనిపొయ్యాడు. ఆ డబ్బుతో అలిమేలు కూతురికి పట్నంలో చదువు చెప్పిస్తోంది. కూతురు, హొన్నప్ప గారబ్బాయి మాధవరావు (మావుగారు) కలిసి చదువుకుంటున్నారు. వారికి స్నేహం యేర్పడింది. ఆమె చదువుకోడంతో పనిమనిషి కూతురన్న చౌకతనం పోయింది. సమానురాలైంది.

"కలిపి చదువుకోడం మట్టుకేనా?" అనడిగాడు.

ఆమెకి అర్థమైనట్లు లేదు. సమాధానం రాదు.

"మొన్న సినిమాలో చూశాను, వారిద్దరినీ" అన్నాడు ఏమీ మాట్లాడదు.

"ఓ నవ్వులు. మీద చెయ్యేశాడు. ఇంటిదగ్గిరి దిగపెట్టాడు."

ఏమీ మాట్లాడదు.

"బాగా ఇష్టం అన్నమాట"

"రాజమ్మకి మావుగారంటే ఇష్టం."

"పెళ్ళి చేసుకుంటుందా?"

"ఏమో."

"మరి నీ పెళ్ళి?"

సిగ్గుతో తలవంచుకుని నవ్వుతోందని, బుగ్గల తీరువుల్ల గ్రహించాడు.

"చేసుకుంటావా?"

ఎలాగో చూసింది. అతన్ని తలుపు దగ్గరనుంచి తోసింది. చెయ్యి భుజంమీద పడింది.

"ఏం పన్లు?"

"ఇష్టం లేదా?"

లేదన్నట్లు తల జోరుగా కదిలింది.

"మీ కాళ్ళకి మొక్కుతా, నన్ను పోనీయండి" అని చేతులు జోడించింది.

"హొన్నప్పగారికి, అలిమేలుకి – స్నేహమా?"

"ఏమో"

"అదొక్కటే చెప్పు. వెళ్ళనిస్తా."

"ఏం చెప్పను?"

"ఎంతకాలంనుంచి పనిచేస్తోంది?"

"చాలాకాలంనుంచి. రాజమ్మ చిన్నపిల్ల – హొన్నప్పగారి వ్యాపారానికి పెట్టుబడి కూడా పెట్టింది పిన్నమ్మ. ఇంట్లో కర్చులొస్తే అప్పిస్తావుంటుంది."

"అమ్మగారికి తెలుసా?"

"తెలీదు."

"ఏం కథ?"

నవ్వుతుంది. తలుపుతీశాడు మోహన్‌బాబు. జేబులోంచి ఐదురూపాయలనోటు తీసిచ్చాడు.

"ఎందుకు?"

"సినిమాకెళ్ళు, గాజులు కొనుక్కో"

"నా కొద్దు."

వెళ్ళిపోయింది నానమ్మ.

డబ్బిస్తే పుచ్చుకోనంతటి నిజాయితీగల పనివాళ్ళకాలం వచ్చింది. పనిమనిషి కూతురుకి పట్నంలో చదువు చెప్పిస్తుంది. యజమానికి పెట్టుబడి పెడుతుంది. అప్పులిస్తుంది. అబ్బాయి కాలేజీ జీతం కట్టాల్సివస్తే, హొన్నప్పగారు ఆమె నడగాల్సి వచ్చింది. సమాజంలో ఆర్థికంగా సంక్రమించిన అంతస్థులు పోయినాయి. యీ యుద్ధంలో – తెగలు, వ్యత్యాసాలు పోయి అంతా ఏకమౌతున్నారు. ఇంక పెళ్ళిళ్ళతో పడిపోతున్న గోడలు నేలమట్టం అవుతాయి.

కాని మాధవరావు, రాజమ్మని పెండ్లి చేసుకుంటాడా? వాళ్ళింట్లో పనిమనిషి కూతుర్ని ఎంత చదువుకున్నదైనా చేసుకోడు. కులాసాగా, సరదాగా, స్నేహంగా వుంటాడు. వివాహం ఉద్దేశం వుండకూడదు. ఓ వేళ ఉన్నా తల్లిదండ్రులు అందుకంగీకరిస్తారా? అతనలా చెడిపోవడం మంచిదికాదు. దాన్ని ఆపుచెయ్యడం తనకర్తవ్యం. హొన్నప్పగారితో చెప్పడం శ్రేయస్కరం.

శెలవలవగానే మాధవరావు పట్నం వెళ్ళిపోయ్యాడు. నాన్నిచ్చిన డబ్బు, అలిమేలుదని అతనికి తెలుసా? తెలిస్తే రాజమ్మతో స్నేహంగా ఉండగలడా? నానీ తనిచ్చిన ఐదురూపాయలనే తృణీకరించిందే! కాని ఆమధ్య యిచ్చినరెండు రూపాయలూ తీసుకుందేం నానీ? అంతా అయోమయంగా వుంది. రాజమ్మ కూడా వూరికి వెళ్ళే వుంటుంది.

ఆ రోజు శనివారం, మధ్యాహ్నం మూడైంది. హొన్నప్పగారు ఏవో పద్దు పుస్తకాలు చూసుకుంటున్నాడు. గదిలోకి వెళ్ళాడు మోహన్‌బాబు.

"రండి కూర్చోండి" అని కుర్చీ చూపించాడు హొన్నప్పగారు.

"చదువూ అదీ బాగా సాగుతోందా?"

"ఆహా" అన్నాడు, "అదీ" అంటే మరింకేమిటా అని ఆలోచిస్తూ.

"సంతోషం"

"మీ వ్యాపారం బాగా వుందా?"

"ఏం వుండడం లెండి" ఇప్పుడేదీ అనుకొన్నట్లుగా సాగడం లేదు."

"మీతో వో విషయం చెప్పాలి. ఓ విషయంగా, నాకెట్లాంటి హక్కూ లేదనుకోండి."

"చెప్పండి."

"మీ వాడు ఒక తక్కువ కులందానితో స్నేహం చేస్తున్నాడు. నేచూశాను."

ఆశ్చర్యం ప్రకటించాడు హొన్నప్పగారు.

"ఎవరితో?"

"మీకు తెలిసే వుంటుంది."

"ఎబ్బే! నాకు తెలీదు. చెప్పండి."

"మీ ఇంట్లో పనిచేసే అలివేలు కూతురుతో."

"నానీతోనా?"

"కాదు."

"మరి?"

"మీకు తెలుసు."

"రాజమ్మతోనా?"

బిగ్గరగా నవ్వాడు. "వాళ్ళు క్లాస్‌మేట్స్‌గా."

"కథ చాలా దూరం వెడుతోంది."

"అంటే?"

పక్కగదిలోంచి అన్నపూర్నమ్మగారొచ్చింది.

"మా మావూ మాట చెబుతున్నారా?" అన్నదామె. అన్నపూర్ణమ్మగారు పెద్దామె. జుట్టంతా నెరిసింది. చెవలకి ఎర్రరాళ్ళ దుద్దులున్నాయి. మాధవరావు తల్లిపోలికే."

"అలిమేలు కూతురుతో మావాడా?" అన్నదామె.

"మరేంలేదులెండి. ఇప్పట్లో స్నేహమే కావొచ్చు, అంటే మొదట్లో. తరవాత ఏ కడుపో కాలో..."

మోహన్‌బాబు వాక్యం పూర్తికాకుండానే అన్నపూర్ణమ్మగారు 'ఆ' అని పెద్దగా అరిచి, పక్కనున్న మంచంపైన వాలిపోయింది.

"ఏమిటండీ మీరంటూ వుంట?" అని గర్జించాడు హొన్నప్పగారు.

"ముందు ఆవిడ విషయం చూడండి."

ఆమెకి మంచినీళ్ళిచ్చారు. ఆమె చేతులు, కాళ్ళు గజగజ వొణికిపోతున్నాయి.

"నేనేమీ అనలేదు. రేపు ఏ కడుపో కాలో వస్తే వివాహం చేసుకునే అవసరం రాకుండా పోతుందంటారా? ఆ మధ్య డాక్టరింటికి కూడా వెళ్ళారుట."

అన్నపూర్ణమ్మగారు మరో కేకపెట్టింది. మెడ, తల వూగిపోతున్నాయి.

"బాబ్బాబు. డాక్టర్ని పిలుస్తారా?"

మోహన్‌బాబు, డాక్టర్ కోసం వెళ్లాడు. డాక్టర్‌ని తీసుకొచ్చేటప్పటికి అరగంటైంది. ఈలోగా అలిమేలు కూడా వచ్చింది. అమ్మగారికి సపర్యలు చేస్తోంది.

అన్నపూర్ణమ్మగారు మాట్లాడడంలేదు. పక్షవాతం అని తేల్చాడు డాక్టరు.

ఆ రాత్రంతా అందరూ ఆమె మంచంచుట్టూ జేరి, కావలసింది చూస్తూ, ఒంటికి తైలం మర్దనచేస్తూ, కునుకుతీస్తూ గడిపారు. ఆమె యీ స్థితికి తను కారణం అనుకోక తప్పింది కాదు మోహన్‌బాబుకి. అలిమేలు, నానీ, అతనికేసి కోపంగా చూస్తున్నట్లని పించింది. ఇదంతా తనెందుకు తెచ్చిపెట్టుకున్నట్లు! మంచిచేద్దామని.

ఆ మొర్నాడు, మాధవరావుని అర్జంటుగా రమ్మని టెలిగ్రాం యిచ్చినట్లు తెలుసుకున్నాడు మోహన్‌బాబు.

డాక్టరు ప్రమాదం లేదని ధైర్యం చెప్పాడు. అది మొదటిసారి వచ్చినప్పటి తీవ్ర లక్షణంట. తేరుకుందిట. మరోసారి రాకుండా భద్రంగా ఉండాలిట. డాక్టర్ వెళ్ళేటప్పటికి, మధ్యాహ్నం పన్నెండు దాటింది. మోహన్‌బాబు హోటల్‌లో భోజనంచేసి వచ్చాడు.

అతనికి నిద్రొస్తోంది. కారియర్ కడిగితెచ్చింది అలిమేలు.

"మీరెందుకు అవన్నీ చెప్పడం?"

ఆమె ధైర్యానికి చకితుడయ్యాడు మోహన్‌బాబు. నిద్ర ఒక్కసారిగా పోయింది. మంచంమీద కూర్చున్నాడు.

'మీకు నానీ జోలెందుకు? మాధవరావుగారంటె – మా రాజమ్మని పెండ్లి చేసుకుంటాడు. మీరు చేసుకుంటారా నానీని?'

ఆ ఉద్రేకంలో ఆమెని దగ్గరగా, పూర్తిగా చూడగలిగాడు. నలభై దాటుతుందేమో ఆమె వయస్సు. శరీరం ముడతలు పడుతోంది కళ్ళకింద నలుపు తెలీకుండా, కాటుక కాపాడుతోంది. మంచి దుస్తులు వేసుకుంటే బాగానే ఉంటుంది. దుస్తులు, పోషణ సంస్కారం – యివే మనుషుల్ని వేరుచేసేవి. కళలో యివన్నీ పోతాయి. అంచేతే కళని అంతర్జాతీయ భాషగా గౌరవిస్తున్నారు.

"నేను నానీని ఏం చేశాను?"

"మరి డబ్బివ్వడం దేనికి?"

"సంతోషపెట్టడానికి?"

"దీపం ఆర్పడం?"

ఛీ, ఛీ – యింత పచ్చిగా అడుగుతుందేమిటి? మరో ఉద్దేశం లేకుండా సంతోషపెట్టడం అనేది ఆమె అర్థం చేసుకోవాలంటే అర్ధశతాబ్దిసంస్కారం రావాలి అనుకున్నాడు.

"అంత ఇష్టంగా వుంటే పెండ్లి చేసుకోండి.రేపు మాధవరావుగారొస్తుండారు. రాగానే, అన్నీ మాట్లాడుకుందాం."

"ఇంకా నయం, – మాధవరావు మీ అమ్మాయిని చేసుకుంటాడనా?"

"ఓ, ప్రమాణం చేశారు. డాక్టర్‌కి చూపించా రాజమ్మని. మూడో మాసంట..."

తలుపు చప్పుడయ్యేటట్లు వేసి వెళ్ళింది అలిమేలు.

మోహన్‌బాబుకి ఆలోచించేశక్తి పోయింది. ఏదో ఆకృతి, కేంద్రంలేని భయం పుట్టుకుంది. పోస్టుమేన్ ఇచ్చిన ఉత్తరం సరిగ్గా చూడనేలేదు. చూసినా, అందులో

ఏముందో తెలీలేదు. గబగబ పెట్టెలోకి సామాన్లు సర్దాడు. బల్లమీద ఉన్నవాటిని. ట్రంకులో పడేశాడు. మంచం వూడదీసి నవారుతో కట్టాడు. పాతబట్టలన్నీ హోల్డాల్‌లో పడేశాడు. రోడ్డు మీదకెక్కి జట్కాపిల్చుకొచ్చాడు. సామాన్లు అందులో కెక్కించాడు. ఇంటి తలుపులు వేసివున్నాయి. హొన్నప్పగారు పరున్నారు. అలిమేలు ఇంటికెళ్ళింది. ఎవ్వరూ చూడటంలేదు, అమ్మయ్య అనుకున్నాడు.

మళ్ళా గదంతా ఒక్కసారి పరకాయించి చూశాడు. అలారం గడియారం ట్రంకులో పెట్టాడు. బల్లకింద పడివుంది మూడుకోతుల బొమ్మ. తను చెడుగు చూశాడు విన్నాడు; చెప్పాడు. దాన్ని తీసి దూరంగా కిటికిలోంచి గిరవాటెట్టాడు. స్నానం గదిలో సోప్‌కేస్, టూత్ బ్రష్‌మాట మరిచిపోయి బండెక్కి స్టేషన్ కొచ్చాడు.

అదీ మోహన్‌బాబు చెప్పిన కథ. ప్లాట్‌ఫారంపై జనం సందడిగా తిరుగుతున్నారు. పోర్టర్లు సామాన్లతో పరుగులెడుతున్నారు. రైలు రానే వచ్చింది. ప్లాటుఫారం ఘాటుకి తట్టుకోలేక తుమ్ముతున్నట్లు శబ్దంచేస్తూ పోర్టర్లు, సామాన్లు మోహన్‌బాబు వో పెట్టిలో కెక్కాడు.

"అదీ విషయం. నేను లేకపోయినందుకు మరోలా అనుకోకు" అన్నాడు మోహన్‌బాబు.

"నువ్వేమంటావ్?" అన్నాడు మళ్ళా. ఏం వ్యాఖ్యానం చెయ్యాలో నాకు తెల్సింది కాదు.

"ఏమీ అనను. వ్యాఖ్యానం కూడా నువ్వే చేసేశావు" అన్నాను.

"అంటే?"

"కోతులబొమ్మ అవతల పారేశావుగా" అన్నాను. ఇద్దరం బిగ్గరగా నవ్వుకున్నాం. గార్డు విజిల్ వేశాడు. మిగిలిన జనం పెట్టెలలోకి ఎగబడుతున్నారు. ప్లాట్‌ఫారం తుమ్మితే వూడిపడ్డట్లు ఒక్కడోకుతో ఇంజిన్ కదిలింది పట్టాలు మూలిగాయి. తలుపుల దగ్గర జనం నిలబడి చేతులు వూపుతున్నారు. జ్వరంతో మూలుగుతున్న రైలుమీద శాలువా కప్పినట్లు.

ఓ అమ్మాయి గబగబ వగర్చుకుంటూ పరుగెత్తుకొచ్చి మోహన్‌బాబు కూర్చున్న కిటికీలోకి, ఏదో గిరవాటెట్టింది. రైలు వెడుతోంది. అతను దాన్ని పైకి చూపించాడు. అది కోతులబొమ్మ.

"మరిచిపొయ్యారు" అన్నదామె. దూరమైపొయ్యారు రైల్లో వ్యక్తులు. మోహన్‌బాబు ఆమెకేసి చూస్తున్నాడు. ఆమె వెనక్కి తిరిగింది. నాకేసి చూసి నవ్వింది. నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె 'నానీ' అని గ్రహించాను. మోహన్‌బాబుకి ఆమె కావాలి. ఆమెతో వివాహంకాదు. మూడుకోతుల నీతి యింకా దాన్ని ఆమోదించే స్థితికి రాలేదు. కాబోలు అనుకొని సామాన్లు పోర్టర్ నెత్తినపెట్టి బైటకి నడిచాను.

రచనాకాలం : 1959, మే 17, జూలై 22-26 - ప్రచురణ : తెలుగు స్వతంత్ర - 15.8.1959